క్లుప్తంగా

ఎరువులు అందుబాటులో ఉంచాలి



రుద్రూర్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులను అందుబాటులో ఉంచాలని కోటగిరి మండల వ్యవసాయాధికారి టి రాజు సూచించారు. కోటగిరి మండలం కొత్తపల్లి సింగిల్ విండో, సొసైటీ పరిధిలోని రాంపూర్ గోదామును స్థానిక తహసీల్దార్ గంగాధర్‌తో కలిసి తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్‌లు, రసీదులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు క్రయ విక్రయాలకు సంబంధించిన రసీదులు ఇవ్వాలని సూచించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ఆర్మూర్‌టౌన్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ధోబిఘాట్ వద్ద ఏఐకేఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. తరుగు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, భూమన్న, గణేశ్, గంగాధర్, గంగారెడ్డి, బాల్‌రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జీలుగ సాగుతో మంచి ఫలితాలు

వేల్పూర్: రైతులు పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లుకోడానికి ఇది అనువైన సమయమని ఏఈవో స్నేహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌడు భూములు ఉన్న రైతులు జీలుగ విత్తనానికి బదులు జనుము విత్తనాలు పొలంలో చల్లుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. జనుము విత్తనాలు గోవింద్‌పేట్ సొసైటీలో అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్ తీసుకెళ్లి పొందాలని సూచించారు.

ఓపెన్ జిమ్ కోసం వినతి



ఎడపల్లి: మండలంలోని ఠాణాకాలనీలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకులు ఎంపీ అర్వింద్ పీఏకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ఎంపీ కార్యాలయంలో ఎంపీ అందుబాటులో లేకపోవడంతో పీఏకు వినతి పత్రం అందించినట్లు వారు తెలిపారు.

రేషన్ బియ్యం తరలించిన ఇద్దరికి మూడేళ్ల జైలు..

ఎడపల్లి(బోధన్): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ బోధన్ మొదటి అడిషనల్ సివిల్ జడ్జి ఈ. సాయిశివ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని కోజ్జా కాలనీకి చెందిన మహమ్మద్ సమీర్‌ఖాన్(21), మాలపల్లికి చెందిన ట్రక్ డ్రైవర్ మహమ్మద్ అర్బాజ్(20)లు 2018లో ట్రక్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఎడపల్లి వద్ద పట్టుబడ్డారు. వీరిపై అప్పటి ఎస్సై టాటాబాబు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో మహమ్మద్ సమీర్‌ఖాన్, మహమ్మద్ అర్బాజ్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 3 వేల జరిమానా విధించారు.

హబీబ్‌నగర్‌లో యువకుడిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని హబీబ్‌నగర్‌లో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్‌కు చెందిన షేక్ షహబాత్, తన చిన్న తమ్ముడు షేక్ అబ్రార్ అదే కాలనీలోని ఓ కిరాణా దుకాణం ఎదుట మంగళవారం సాయంత్రం నిలబడి ఉండగా కొందరు హేళన చేస్తూ వెళ్లారు. దీంతో షహబాత్ వారిని తీవ్రంగా బెదిరించాడు. దీనిని దృష్టిలో పెట్టుకున్న వారు అదే రోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో షెహబాత్ ఇంటికి చేరుకొని అబ్రార్‌ను, మరో తమ్ముడు షహజాజ్‌పై సైతం దాడి చేశారు. విషయం తెలుసుకున్న షహబాత్ అక్కడికి రావడంతో అతనిపై కూడా దాడి చేశారు. ఇందులో హర్షత్ అనే వ్యక్తి షహబాత్ ఛాతిపై కత్తితో తీవ్రంగా గాయపర్చాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు



ఆర్మూర్‌లో వరదనీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం



ఆలూర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



అడవి మామిడిపల్లిలో పంటలో చేరిన నీటిని తీసేస్తున్న రైతు

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షంతో పంటపొలాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిచింది. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో మంగళవారం అర్ధరాత్రి, సోమవారం భారీగా వర్షం కురిసింది. ఆర్మూర్‌లో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం నీటికి కొట్టుకుపోయింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని చోట్ల చెట్లు నెలకొరిగాయి. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో ఎడ తెరిపి లేకుండా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అకాల వర్షం కురవడంతో సజ్జ పంట తడిసింది. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు లేక తడిచిపోతున్నాయి. ఆలూర్ మండలంలో కురిసిన వర్షానికి ఎండబెట్టిన ధాన్యంతో పాటు సజ్జ పంట తడిచింది. కొనుగోలు కేంద్రాల వద్ద నత్తనడకన తూకాలు జరగుతుండటంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపైన కల్లాల వద్ద ఆరబెట్టి ఉంచారు. రాత్రికురసిన భారీ వర్షానికి ధాన్యం తడిసింది. మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లిలో బీర తోట ధ్వంసమైంది. వర్షపు నీరు చేరడంతో రైతులు వాటిని తీసివేశారు. మాక్లూర్ మండలంలోని కల్లెడి, ఢీకంపల్లి, చిన్నాపూర్, గుత్ప, రాంచంద్రాపల్లి, అమ్రాద్‌తండా, మాణిక్‌బండార్‌తండా, కృష్ణనగర్‌లో ఎక్కువగా బీర సాగు ఉంటుందని వ్యవసాయ అధికారి పద్మ వెల్లడించారు.



హుస్నాబాద్ కాలనీలో నేలకొరిగిన చెట్టు



ముప్కాల్: రెంజర్లలో నిలిచిన వర్షపు నీరు

ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం చేస్తాం

ఆర్మూర్: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమన్‌కుమార్, నేతికుంట శేఖర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఆర్మూర్ తాలుక టీఎన్జీవోస్ అధ్యక్షుడు కుంట శశికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ శాఖలో సమస్యలు ఉంటే సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. విధులు నిర్వహిస్తూనే సంఘానికి సేవలు అందించాలన్నారు. అనంతరం అజెండాల అంశాలపై చర్చించారు. అనంతరం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమన్‌కుమార్, నేతికుంట శేఖర్‌ను ఆర్మూర్ టీఎన్జీవోస్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు పోల శ్రీనివాస్, అతిక్, సృజన్, వలమాల, సుధాకర్, స్వామి, సునీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుమన్‌కుమార్

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



నందిపేటలో రక్తదానం చేస్తున్న యువకులు



హైదరాబాద్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న రాజేశ్వర్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు బుచ్చిమల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, పాషా, అజార్, కిషన్ గౌడ్, సల్లూరి గణేశ్‌గౌడ్, సుంకరి గంగాధర్, దీపక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్ ఎదుట నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకల్లో ముప్కాల్ మండలం వేంపల్లి సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్ పాల్గొన్నారు. దేశానికి ఆయన చేసిన సేవాలను కొనియాడారు.

నందిపేట్: నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు రక్తదానం చేశారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు పిప్పెర సాయరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, నాయకులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుంతల చింత తీరేదెన్నడు?

బాల్కొండ: ముప్కాల్, మెండోరా మండలాల్లో పలు రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులోని పెద్ద వాగు రోడ్డుపై, మెండోరా మండలం వెల్కటూర్ తండా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు చేరుతోంది. దీంతో ఆ గుంతలు కనిపించడం లేదు. ఈ రోడ్డు గుండా వచ్చే ప్రయాణికులు గుంత అని తెలియక ప్రయాణించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



పెద్ద వాగు రోడ్డుపై ఏర్పడిన గుంత



వెల్కటూర్ తండా రోడ్డుపై ఏర్పడిన గుంత

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం



బోధన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



శక్కర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

- ప్రణాళికబద్ధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నాం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, రాకాసీపేట, పాన్‌గల్లీలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నియోజక వర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందని, మొదటి విడతగా 600 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, శరత్, బి గంగాశంకర్, తూము శరత్‌రెడ్డి, దాము, పాషా మోహినొద్దీన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

బోధన్ మున్సిపాలిటీకి ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో అభివృద్ధి, పనుల పురోగతి, ఆదాయ వ్యయాలు, పెండింగ్ బిల్లులు, పట్టణ మౌలిక సౌకర్యాలు, పాలనపరమైన అంశాలపై సమీక్షించారు. రాబోయే వర్షాకాలంలో పట్టణ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ వ్యవస్థను సాఫీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



గ్రామస్తులతో ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి



అన్నారంలో భూమి పూజ చేస్తున్న అధికారులు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ నితీశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జక్క లింగం, చాట్ల నరేశ్, ప్రవీణ్, డీసీసీ డెలిగేట్ కపిల్, మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో..

ధొంకేశ్వర్: మండలంలోని అన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు అధికారులు బుధవారం భూమి పూజ చేశారు. గ్రామంలో మొత్తం 23 ఇళ్లు మంజూరైనట్లు పంచాయతీ కార్యదర్శి మౌనిక తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవడానికి ముందుకు రావాలని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేశ్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాపూర్‌లో..

నందిపేట్: మండలంలోని శాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు దమ్మాయి శీను, నిరడి సంతోష్, మన్నె సాగర్, నాయకులు పాల్గొన్నారు.



శాపూర్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు

బైక్, స్కూటీ ఢీ.. ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మ వెంచర్‌లో ఈ నెల 18న ఉదయం ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ స్కూటీని గుర్తు తెలియని బైక్ ఢీకొట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పీఎస్‌లో విధులు ముగించుకొని అమ్మ వెంచర్‌లో ఉన్న తన ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు

ఎడపల్లి: అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారుల హాజరు పట్టికను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎంపీడీవో విధులకు హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి పీఆర్ ఏఈ కూడా అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. బోధన్ నుంచి నిజామాబాద్ ప్రధాన రహదారుల వెంట గుంతలు లేకుండా జీపీ కార్యదర్శులు, ప్రత్యేక చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టే విధంగా చూడాలని అన్నారు. గ్రామాలకు వెళ్లి రహదారుల పక్కనున్న గుంతలకు మరమ్మతులు చేపట్టే విధంగా పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి జీపీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇంటి, నీటి కుళాయి పన్ను ఏ మేరకు వసూలయ్యాయో జీపీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పులి శ్రీనివాస్ రావు, బిల్ల రామ్మోహన్, కరటూరి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, శంకర్ నాయుడు, మన్మోహన్ శాస్త్రి, శ్రీవాణి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రోహిణి కార్తెలో మొక్కజొన్న ఫలించేనా

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో రైతుల వెనకడుగు



మొక్కజొన్న సాగు చేసేందుకు వ్యవసాయ క్షేత్రంలో వేయించిన నల్ల మట్టి



వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ ఎరువులు వేసుకుంటున్న రైతు

ఆర్మూర్: ఈ ఏడాది రోహిణి కార్తెలో మొక్కజొన్న సాగు చేయాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ మంచి దిగుబడి సాధించడంలో ఆర్మూర్ ప్రాంత రైతాంగానికి జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నట్లు ముందుగా వర్షాలు కురిసే అవకాశం ఉందనే నమ్మకంతో పెట్టుబడిని లెక్కచేయకుండా మొక్కజొన్న విత్తడానికి సిద్ధమవుతున్నారు. మే నెల మూడో వారంలో రోహిణికార్తె ప్రవేశం చేయగానే ఆర్మూర్ ప్రాంత రైతులు హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఎంపిక చేసుకొని మొక్కజొన్న పంటను వేస్తారు. రోహిణి కార్తెలో వేసిన మొక్కజొన్న పంట జూలై ఆఖరు నాటికి కోతకు వస్తుంది. అప్పుడు మొక్కజొన్న పచ్చిబుట్టకు అధికంగా డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులకు పచ్చి మొక్కజొన్న బుట్టలను విక్రయించడంతో అధిక శ్రమ లేకుండా లాభపడతారు. మొక్కజొన్నను ముందుగా వేయడం వల్ల ఈ పంటను వేసిన భూమిలో డిసెంబర్ నాటికి రెండో పంటను, మళ్లీ రబీలో మూడో పంటను పండించే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడానికి ఆర్మూర్ ప్రాంతంలో రైతులు ఖరీఫ్ మెట్ట పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ మెట్ట పంటల కోసం రైతులు తమ భూములను దుక్కిదున్నడం, సేంద్రియ ఎరువులు వేసుకోవడం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మొదటి పంటగా మొక్కజొన్న పంటను వేస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల ఎకరాల్లో బోరుబావుల కింద మొక్కజొన్నను ఖరీఫ్ మొదటి పంటగా వేసే అవకాశముంది. ఆర్మూర్ ప్రాంతంలో 90 శాతం వ్యవసాయం బోరుబావులకిందనే సాగవుతుంది. మెట్ట పంటలలో మంచి ఆదాయాన్నిచ్చే మొక్కజొన్న పంటల ను ఆర్మూర్ డివిజన్‌లోని అన్ని మండలాలలో సాగు చేస్తారు. కానీ ప్రస్తుత కరువు పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీని వల్ల ప్రస్తుత రబీ మెట్ట, మాగాణి పంటలకు సాగునీరు కొరత ఏర్పడుతుందని రైతు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీ వరి కోతలు ముగించుకున్న రైతులు సజ్జ పంటను పూర్తిచేసుకొ ని ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్న పంటకు నల్లమట్టిని, పశువుల పేడతో కూడిన సేంద్రియ ఎరువులను వేసుకుంటున్నారు. దీంతో పాటు తొలకరి వర్షాలు కురవగానే పసుపు పంట వేసేందుకు కూడా అవసరమైన సేంద్రియ ఎరువులను లారీల ద్వారా ఇతర ప్రాంతాలనుంచి తెప్పించుకుంటున్నారు. రబీ పంటలను ముగించుకోవడం వల్ల ఖరీఫ్ పంటలను వేసుకోడానికి అవసరమైన ఏర్పాట్లలో రైతులు బిజీగా ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



జక్రాన్‌పల్లి: అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్‌లో తడిసిన ధాన్యాన్ని డీసీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షంలో తడిసిన ధాన్యాన్ని సొసైటీ తరఫున కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట అర్గుల్ సొసైటీ సీఈవో తిరుపతిరెడ్డి, రైతులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు అభినందన

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీ ఉ న్నత పాఠశాల విద్యార్థులను ఎంఈవో శ్రీనివా స్ అభినందించారు. ఈ నెల 21 వరకు మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో నిర్వహించిన 11వ రాష్ట్ర జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి బంగారు పతకం సాధించిన క్రీడాకారులు రాజు, నాగసూర్య, విష్ణుశ్‌లను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో పీడీ గంగామోహన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగాజమున, క్రీడాకారులు పాల్గొన్నారు.